సాక్షి అనంతపురం

గురువారం । 16 । మే । 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



వేసవి దుక్కు..లాభాలు దక్కు

వేసవి దుక్కులతో రైతులు అనేక లాభాలు పొందవచ్చని శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, డాక్టర్ నారాయణ స్వామి తెలిపారు. 10లో

గరిష్టం/కనిష్టం 39.9°/22.4°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత స్వల్పంగా తగ్గింది. ఆగ్నేయం నుంచి నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 144 సెక్షన్

- తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ కొనసాగింపు
- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

చట్టవిరుద్ధ సమావేశాలు నిషిద్ధం

- ఐపీసీ సెక్షన్ 141 ప్రకారం చట్టవిరుద్ధంగా సమావేశాలు నిర్వహించరాదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఊరేగింపు, ర్యాలీలు చేపట్టకూడదు.
- తుపాకులు, కత్తులు, రాళ్లు, కర్రలు, ఇతర ఆయుధాలు తీసుకెళ్లడం నిషిద్ధం.
- ఐదుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఒక చోట ఉండకూడదు.

వీరికి, వీటికి వర్తించదు

ఉత్తర్వుల నుంచి కొందరికి, కొన్ని కార్యక్రమాలకు మినహాయింపు ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించదు. వివాహాలు, అంత్యక్రియల ఊరేగింపులు, మతపరమైన ఊరేగింపులు, కార్యక్రమాలకు వర్తించదు. జిల్లా ఎన్నికల అధికారి, పోలింగ్ అధికారులు, మెజిస్ట్రేట్‌లు, పోలీసు అధికారులు, ప్రభుత్వ సిబ్బందితో సహా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎన్నికల విధులపై అధికారం పొందిన అధికారులకు 144 సెక్షన్ వర్తించదు.

ఏఎస్పీ రామకృష్ణ ప్రోద్బలంతోనే నా ఇంటిపై దాడులు

- ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆగ్రహం

తాడిపత్రి రూరల్: ఏఎస్పీ రామకృష్ణ ప్రోద్బలంతోనే తన ఇళ్లు, వైఎస్సార్ సీపీ కార్యాలయంపై పోలీసులు దాడులు చేసి వీరంగం సృష్టించారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కార్యాలయంపై దాడి జరిపి సీసీ కెమెరాలు ధ్వంసం చేయడం, ఫర్నీచర్ పగులకొట్టడం, కంప్యూటర్‌ను ధ్వంసం చేసి హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లడంపై మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తే సహించేది లేదన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డికి అడిషనల్ ఎస్పీ రామకృష్ణ మద్దతుగా నిలిచి దాడులు చేయిస్తున్నాడన్నారు. ఇప్పటికే అతడిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని, మరోసారి ఈ వ్యవహారాన్ని కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నేడు ఏపీఈఏపీ సెట్

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్ (గతంలో ఎంసెట్) గురువారం జరగనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 29,025 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఎస్ఆర్ఐటీ, పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ బాలాజీ పీజీ కళాశాల, అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల, ఎస్వీఐటీ, గేట్స్, తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల, సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నెల 23 వరకు రెండు సెషన్లలో పరీక్ష జరగనుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని పరీక్ష అధికారులు స్పష్టం చేశారు.

పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం



మంటలు ఎగిసి పడుతున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన ఎస్ఎల్‌పీపీ పరిశ్రమలో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పొగ కారణంగా ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే...ఇటీవల ఎస్ఎల్‌పీపీ పరిశ్రమ విస్తరణలో పనులు చేపట్టారు. బుధవారం వెల్డింగ్ పనులు చేస్తుండగా... నిప్పురవ్వలు సమీపంలోని గుజిరీ సామగ్రిపై పడ్డాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించగా రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. ఈ సమయంలో అక్కడే పనిచేస్తున్న ఇద్దరు కార్మికులు పొగ కారణంగా ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. వారిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పెనుకొండ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఎస్‌ఐ విజయ్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

పేదలకు నాణ్యమైన వైద్యం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బోధనాస్పత్రికి మహర్దశ
- పెరుగుతూనే ఉన్న పీజీ సీట్ల సంఖ్య
- గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 70 సీట్ల దాకా పెంపు
- ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించడంతోనే భారీగా సీట్ల మంజూరు
- రోగులకు ఉత్తమ సేవలందేలా చొరవ



అనంతపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల

అనంతపురం మెడికల్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనంతపురం బోధనాస్పత్రికి మహర్దశ వచ్చింది. 2000 సంవత్సరంలో ఏర్పాటైన బోధనాస్పత్రికి పీజీ సీట్లు రావడానికి 18 ఏళ్లు పట్టింది. మౌలిక వసతులు సమకూర్చకపోవడంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆశించిన స్థాయిలో పీజీ సీట్లు రాలేదు. అయితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల సంక్షేమమే లక్ష్యంగా వైద్య రంగానికి పెద్దపీట వేసి మౌలిక వసతులు కల్పించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పీజీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. దాదాపు 70 వరకూ సీట్లు మంజూరయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం వైద్య కళాశాలలో పీజీ సీట్ల సంఖ్య 112కు చేరింది.

ప్రైవేటుకు దీటుగా సేవలు

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నాకే ప్రభుత్వ బోధనాస్పత్రి బలోపేతమైందంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. కోవిడ్ విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు పెద్ద సంఖ్యలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్, క్లాస్ 4 సిబ్బందిని నియమించింది. ఇదే క్రమంలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.30 కోట్ల ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేయడంతో ప్రైవేటుకు దీటుగా 7 రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

24 గంటలూ మెరుగైన వైద్యం

ప్రస్తుతం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజూ 2,500 ఓపీ(అవుట్‌పేషెంట్), 1,300 ఐపీ (ఇన్‌పేషెంట్) సేవలందుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు, చిత్తూరు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. రూ.లక్షలతో కూడుకున్న ఖరీదైన వైద్యం ప్రజలకు ఉచితంగా అందుతోంది. గైనిక్ విభాగంలో రోజూ 20 నుంచి 25 ప్రసవాలు జరుగుతున్నాయి. సర్జరీ, ఆర్థో, ఈఎన్‌టీ తదితర విభాగాలకు సంబంధించి రోజూ 30 వరకూ సర్జరీలు జరుగుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనతోనే ఇదంతా సాధ్యమవుతోంది. వీటన్నింటినీ పరిశీలించిన ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) బోధనాస్పత్రికి గణనీయ సంఖ్యలో పీజీ సీట్లు మంజూరు చేసింది. ఇకపై పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు 24 గంటలూ సేవలందించేందుకు వీలుంటుంది. దీంతో సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాల ద్వారా రోగులకు, ప్రత్యేకంగా గైనిక్, ఆర్థో, సర్జరీ, అనస్తీషియా తదితర విభాగాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందనున్నాయి.

బోధనాస్పత్రి ఏర్పాటైన సంవత్సరం	2000
ప్రొఫెసర్లు	26
అసోసియేట్ ప్రొఫెసర్లు	61
అసిస్టెంట్ ప్రొఫెసర్లు	124
ట్యూటర్లు	10

భవిష్యత్తులో మరిన్ని సీట్లు



పీజీ సీట్ల పెంపుతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఏర్పడడంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుంది. ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు తనిఖీ చేసినప్పుడు ఇక్కడి మౌలిక సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. తద్వారానే పీజీ సీట్లు వంద దాటాయి. రానున్న రోజుల్లో మరిన్ని పీజీ సీట్లు మంజూరు కానున్నాయి. రాష్ట్రంలోనే ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మాణిక్యరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

నిఘా నీడలో జీజీహెచ్

- నూతనంగా 109 కెమెరాల ఏర్పాటు



సర్వజనాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన కెమెరాల పర్యవేక్షణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నిఘా వ్యవస్థ పటిష్టమవుతోంది. సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాల్లో మొత్తం 109 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్, లేబర్, గైనిక్ వార్డులు, ఓపీ, ఐపీ బ్లాక్, సర్జరీ, మెడిసిన్, పీడియాట్రిక్స్, ఆర్థో, ఎఫ్ఎం, ఎంఎం, చెస్ట్ వార్డు తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆస్పత్రిలోని క్యాజువాలిటీలో వైద్యులు, రోగి బంధువుల మధ్య ఘర్షణ జరిగింది. వైద్యులు, రోగి సహాయకులు దాడులు చేసుకునే పరిస్థితి తలెత్తింది. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎవరిది తప్పో తెలియక చర్యలు తీసుకోలేని పరిస్థితి. అదేవిధంగా పలు విభాగాల వద్ద వాహనాలు చోరీకి గురవుతున్నాయి. కొన్ని రోజుల క్రితం ఈఎన్‌టీ వార్డులో ఓ పీజీ విద్యార్థి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఇలాంటి వాటన్నింటికీ ఇకపై చెక్ పడనుంది. సీసీ కెమెరాల ఏర్పాటుతో రోగులు, వైద్యులకు మరింత భద్రత ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

ఖాకీ సహకారం.. పచ్చమూక స్వైరవిహారం!

- పోలీసుల నిర్లక్ష్యంతోనే తాడిపత్రిలో ప్రశాంతతకు భంగం
- అనుచరులతో జేసీ అస్మిత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి హల్‌చల్ చేస్తున్నా పట్టని ఏఎస్పీ రామకృష్ణ
- దాడులు, అల్లర్లను ముందస్తుగా పసిగట్టి నియంత్రించడంలో నిఘా వ్యవస్థ విఫలం



జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరుల రాళ్ల దాడిలో పగిలిపోయిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి అద్దాలు



జేసీ అనుచరుల దాష్టీకంతో ధ్వంసమైన వాహనం

తాడిపత్రి అర్బన్: కొందరు పోలీసుల నిర్లక్ష్యపు తీరు కారణంగానే తాడిపత్రివాసుల ప్రశాంత జీవనానికి భంగం వాటిల్లినట్లు స్పష్టంగా తెలుస్తోంది. పోలింగ్ రోజున టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి వంద మంది యువకులను బైకుల్లో వెంటబెట్టుకుని వీధుల్లో హంగామా చేయడం, ఆయన తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి కూడా ఇండిపెండెంట్ అభ్యర్థి చంద్ర ఓబుళరెడ్డికి చెందిన వాహనంలో తిరుగుతూ పచ్చ మూకను వెంటేసుకుని వీధుల్లో స్వైరవిహారం చేయడమే పట్టణంలో శాంతిభద్రతల విఘాతానికి కారణమైన విషయం తెలిసిందే. నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా విహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న జేసీ అస్మిత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డికి అడ్డు చెప్పాల్సిన పోలీసులు ఎక్కడా ఆ పని మాత్రం చేయలేదు. కానీ, వైఎస్సార్ సీపీ నాయకులను మాత్రం టార్గెట్ చేసినట్లు వ్యవహరించారు. ఏఎస్పీ రామకృష్ణ అయితే ఒక అడుగు ముందుకు వేసినట్లుగా ప్రవర్తించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అనుమతులకు లోబడే వాహనంలో ప్రయాణిస్తున్నా పలుమార్లు అడ్డుకుని అభ్యంతరం చెప్పారు. ఇదే క్రమంలో పచ్చ గూండాలు రెచ్చిపోయి ఎమ్మెల్యే పెద్దారెడ్డి కాన్వాయ్‌పై రాళ్ల దాడికి పాల్పడినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను మాత్రం ఎక్కడికక్కడ అడ్డుకుని బలవంతపు ఆంక్షలు విధించారు. ఇలా అడుగడుగునా ఒక వర్గానికి కొమ్ము కాస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడమే తాడిపత్రిలో ఉద్రిక్తతలకు కారణమైంది. పోలీసుల నిర్లక్ష్య వైఖరి కారణంగా స్థానికులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది.

నిద్రావస్థలో నిఘా వ్యవస్థ..

పోలీసులకు మూడో నేత్రంగా భావించే నిఘా వ్యవస్థ తాడిపత్రిలో నిద్రావస్థలోకి జారుకుంది. తాడిపత్రి పేరు చెప్పగానే మొదటగా గుర్తొచ్చేది ఫ్యాక్షన్. జిల్లాలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా తాడిపత్రి పోలీసు రికార్డుల్లోకెక్కింది. ఎన్నికలంటేనే తాడిపత్రిలో దాడులు, ప్రతిదాడులు చోటు చేసుకుంటాయి. అలాంటి తాడిపత్రిలో నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన నిఘా వ్యవస్థ నిద్రావస్థలో జారుకుందనడానికి సోమ, మంగళవారాల్లో జరిగిన అల్లర్లే నిదర్శనం. పోలింగ్ ఏజెంట్‌పై దాడి జరిగిన వెంటనే జరగబోయే పరిణామాలను ముందే పసిగట్టి, పరిస్థితులను ఉన్నతాధికారులకు చేరవేసి ఇరుపార్టీల వారిని నిలువరించాల్సిన పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోనే లేదు. దీంతోనే జేసీ ప్రభాకర్ రెడ్డి రెచ్చిపోయి పచ్చ మూకతో కలిసి ప్రశాంత పట్టణంలో నిప్పు రాజేశారు.

ఉన్నతాధికారులనూ తప్పుదోవ పట్టించి..

నిఘా విభాగంలో పని చేసే కొందరు అధికారులు తమకు ముందస్తుగా వచ్చిన సమాచారాన్ని పై అధికారులకు చేరవేయకుండా ఏమీ జరగదు, జరగలేదని తప్పుడు సమాచారమిస్తూ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొన్ని రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించి పబ్బం గడుపుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తాడిపత్రిలో నిఘా విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు ఫైర్ అయినట్లు తెలిసింది.

డ్రోన్.. ఖర్చులు తగ్గించెన్!





డ్రోన్‌లో మందు నింపుతున్న రైతు, పత్తి పంటపై మందును పిచికారీ చేస్తున్న డ్రోన్

బొమ్మనహాళ్: అన్నదాతలు సాగులో సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. సంప్రదాయ వ్యవసాయం నుంచి ఆధునికత వైపు వేగంగా అడుగులు వేస్తూ సాగు ఖర్చులు తగ్గించుకుంటున్నారు. లాభసాటి వ్యవసాయం దిశగా సాగుతున్నారు. ఇప్పటికే కాడెద్దుల స్థానంలో ట్రాక్టర్లు వచ్చేశాయి. నాట్లు, కలుపుతో పాటు వరి కోతల వరకూ యంత్రాల ద్వారానే జరుగుతోంది. తాజాగా రసాయన ఎరువులు, మందుల పిచికారీలో సైతం మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. పొలాల్లో పురుగుల మందును చల్లేందుకు డ్రోన్లను వినియోగిస్తూ హైటెక్ సాగుకు బాటలు వేస్తున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన రైతు మోహన్ రెడ్డి తన పొలంలో సాగు చేసిన పత్తి పంటకు బుధవారం డ్రోన్ సహాయంతో పురుగుల మందును పిచికారీ చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు. 8 ఎకరాల పత్తి పంటకు ఏటా కూలీలతో క్రిమి సంహారక మందు పిచికారీ చేయించేవాడు. దీంతో కొంతమేర నష్టం కలిగేది. ఈ క్రమంలోనే డ్రోన్ సహాయంతో పిచికారీ చేయవచ్చని తెలుసుకొని కణేకల్లు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన కొందరిని సంప్రదించాడు. గంటకు రూ.400 చొప్పున ఒప్పందం చేసుకుని పత్తి పంటకు మందు పిచికారీ చేయించాడు. డ్రోన్ వినియోగంతో కూలీల కొరత తీరడంతో పాటు పురుగుల మందు నష్టం కూడా తగ్గిందని రైతు తెలిపాడు. సాగు ఖర్చు 40 శాతం వరకు ఆదా అవుతున్నట్లు చెప్పాడు. సమయం కూడా కలిసి వస్తోందని పేర్కొన్నాడు.

ఓట్ల పండుగ.. అతివలదే హవా

- ఎన్నికల్లో మహిళల ఓటింగ్ 50.04 శాతం నమోదు
- పురుషుల కంటే ఎక్కువగానే ఓట్లు



అనంతపురం అర్బన్: ఓటు వేసే విషయంలో మహిళలు ఎప్పుడూ ముందంజలో ఉంటున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ విషయం రుజువైంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 20,18,161 ఉన్నాయి. ఇందులో పురుషుల ఓట్లు 8,17,536 (49.95 శాతం), మహిళల ఓట్లు 8,19,004 (50.05 శాతం) పోలయ్యాయి. పురుషుల ఓట్లు కంటే మహిళల ఓట్లు 0.10 శాతం ఎక్కువ ఉండడం గమనార్హం.

2014 ఎన్నికల్లో...

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో 29,81,914 మంది ఓటర్లు ఉండగా, అప్పట్లో 23,75,318 ఓట్లు పోలయ్యాయి. పురుషుల ఓట్లు 12,11,213 (50.99 శాతం), మహిళల ఓట్లు 11,64,105 (49.01 శాతం) పోలయ్యాయి. ఆ ఎన్నికల్లో పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లు కేవలం 1.98 శాతం తక్కువ.

అతివల ఓట్లే కీలకం..

మహిళలు ప్రలోభాలకు లొంగరు. వారు చాలా విజ్ఞతతో వ్యవహరిస్తారు. నాయకులు తమకు ఇచ్చిన హామీలు ఏమిటి..? అధికారంలో ఉన్నప్పుడు వాటిని ఎంత వరకు నెరవేర్చారు..? దాని వల్ల ఎంత మేర తాము ప్రయోజనం పొందాము..? ఎంత మేర నష్టపోయాము..? ఇలా ప్రతిదీ బేరీజు వేసుకుంటారు. తదనుగుణంగా తమ ఓటు ఎవరికి అనే విషయంలో ఒక నిర్ధారణకు వచ్చి ఆ మేరకు ఓటు వేస్తారనే దాంట్లో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ క్రమంలో అతివల ఓట్లే అభ్యర్థుల భవితవ్యం తేల్చడంలో కీలకం కానున్నాయి.

2014లో..

మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
29,81,914	23,75,318
పురుషులు	మహిళలు
12,11,213	11,64,105
శాతం	శాతం
50.99	49.01

2019లో..

మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
32,39,517	26,54,257
పురుషులు	మహిళలు
13,43,176	13,11,031
శాతం	శాతం
50.06	49.40

2024లో..

మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
20,18,161	16,36,648
పురుషులు	మహిళలు
8,17,536	8,19,004
శాతం	శాతం
49.95	50.05

క్లుప్తంగా

మతిస్థిమితం లేని వ్యక్తి హత్య

హిందూపురం అర్బన్: మతి స్థిమితం లేని వ్యక్తిని కిరాతకంగా హతమార్చిన ఘటన హిందూపురంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని దొడ్డబళ్లాపురానికి చెందిన సెల్వకుమార్ (54) మతి స్థిమితం లేక బాధపడుతున్నాడు. దీంతో ఆయనను అన్న శివకుమార్ పిలుచుకొచ్చి మూడేళ్ల క్రితం పరిగి మండలం మోదా గేట్ వద్ద ఉన్న సదానంద వృద్ధాశ్రమంలో చేర్పించాడు. అప్పటి నుంచి వృద్ధాశ్రమంలోనే ఆశ్రయం పొందుతున్న సెల్వకుమార్‌ను ఆదివారం ఓ వ్యక్తి వచ్చి బయటకు పిలుచుకెళ్లాడు. ఆ తర్వాత సెల్వకుమార్ ఆచూకీ లేకుండా పోయింది. బుధవారం హిందూపురంలోని పరిగి రోడ్డు మోతుకపల్లి వద్ద ఉన్న అక్కమ్మ గుడి సమీపంలో సెల్వకుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాయితో మోది హతమార్చినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


అలీబాషా (ఫైల్)

పామిడి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని తలవాలకట్ట వీధికి చెందిన కట్టుబడి నబీరసూల్ కుమారుడు అలీబాషా (26) బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన షహీనాతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. తన అవసరాలకు మించి అప్పులు చేసిన అలీబాషా.... వాటిని తీర్చే మార్గం కానరాక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షహీన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం


వెంకట్రాముడు (ఫైల్)

బుక్కరాయసముద్రం: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లికి చెందిన సెంగల వెంకట్రాముడు (50) వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తనకున్న 6 ఎకరాల్లో పంటల సాగుకు, కుమార్తెల పెళ్లిలకు దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చే మార్గం కానరాక మానసిక వేదనకు లోనైన ఆయన మంగళవారం రాత్రి తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేసవి దుక్కులు.. లాభాలు దక్కు

- వాలుకు అడ్డంగా కాంటూరి సేద్యం పనులు చేసుకోండి
- వాన నీటిని ఎక్కడిక్కడ ఇంకేలా చేయాలి
- ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, డాక్టర్ నారాయణస్వామి సూచనలు

నేల, నీటి సంరక్షణకు వేసవి దుక్కులు, కాంటూరు సేద్యపు పనులు ఇలా



అనంతపురం అగ్రికల్చర్: 'దున్నకుండా సాగుచేస్తే.. కొయ్యకుండా పోతుంది!' అనేది తెలుగు నానుడి. ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే. విత్తేందుకు అనుకూలంగా పొలాన్ని సిద్ధం చేసుకోవాలి. దుక్కి చేయకుండా వదిలేయడంవల్ల భూమి చీడపీడలకు ఆవాసంగా మారి సత్తువ కోల్పోతుంది. ముడి పోషకాల లోపం ఏర్పడి, తర్వాతి పంటకు భారీగా ఎరువులు వేయాల్సి వస్తుంది. అందుకే.. రైతులు వేసవిలో లోతు దుక్కుల మీద దృష్టి పెట్టాలని ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ నారాయణస్వామి సూచిస్తున్నారు. జూన్ నుంచి ఖరీఫ్–2024 'ముంగారు' మొదలు కానుండటంతో ఇటీవల కురిసిన వర్షాల ఆధారంగా వేసవి దుక్కులు మొదలు పెట్టాలంటున్నారు. మెట్ట పొలాలు అధికంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం లాభసాటి కావాలంటే లోతుగా దుక్కి చేయడం, నేల, నీటి సంరక్షణకు వాన నీటిని ఎక్కడిక్కడ ఇంకేలా 'కాంటూరి' సేద్యం పనులు చేసుకోవాలని సూచించారు. రాగల నాలుగు రోజులూ ఆకాశం మేఘావృతమై మోస్తరు నుంచి తేలికపాటి వర్షసూచన ఉందన్నారు.

75 శాతం వర్షాధారం..

ఉమ్మడి జిల్లాలో మొత్తం పంట భూమిలో 75 శాతం విస్తీర్ణంలో రైతులు కేవలం వర్షాలపై (మెట్ట సేద్యం) ఆధారపడి సాగు చేస్తున్నారు. ఎక్కువగా ఎర్ర, చల్కా నేలలు ఉన్నాయి. నైరుతీ ప్రభావంతో కురిసే వర్షాలపై ఉమ్మడి జిల్లా పరిధిలో 7 లక్షల నుంచి 8 లక్షల హెక్టార్ల ఖరీఫ్ ఆధారపడి ఉంది. రుతుపవనాలు నిర్ణీత సమయం కన్నా ముందుగా, లేకుంటే ఆలస్యం కావడం.... త్వరగా నిష్క్రమించడం, తక్కువ వర్షాలు కురవడం, అనిశ్చితి వర్షాలు, పంట కాలంలో దీర్ఘకాలం బెట్ట పరిస్థితులు ఏర్పడటం, ఒక్కోసారి విరామం లేకుండా అతివృష్టి సంభవించడం లాంటివి వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఎంత వర్షం కురిసినా అందులో 10 నుంచి 20 శాతం మాత్రమే భూమిలోకి ఇంకిపోయి మిగతాది ప్రవాహం, ఒరవడి రూపంలో కొట్టుకెళ్లి వృథా అవుతుంటాయి. ఇలా ప్రవాహం రూపంలో వెళ్లే వర్షపునీటితో పాటు భూమిపై సారవంతమైన పొర కొట్టుకుపోవడం వల్ల పోషకాల లోపం ఏర్పడి క్రమంగా భూమి ఉత్పాదకశక్తి కోల్పోయి పంట దిగుబడులు తగ్గిపోతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

లోదుక్కులతో విస్తృత ప్రయోజనాలు..

వేసవిలో కురిసే వర్షాలను ఉపయోగించుకుని పొలాల్లో వాలుకు అడ్డంగా ఎర్ర నేలలో ఒక మీటరు, నల్లరేగళ్లలో రెండు మీటర్లు చొప్పున లోతుగా దుక్కులు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీన్నే కాంటూరు సేద్యం అంటారు. భూమిలో గట్టిపొరను కదలించడం ద్వారా పంటలకు కీడు చేసే పురుగులు చాలా వరకు కోశస్థ దశలోనే నశిస్తాయి. పంట కాలంలో చీడపీడలు, తెగుళ్ల ఉధృతి బాగా తగ్గుతుంది. నేల ఎండుతూ... ఆరుతూ ఉంటే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి. అలాగే వర్షపు నీరు ఎక్కడిక్కడ ఇంకిపోయి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. బెట్ట ఏర్పడకుండా కాపాడుకోవచ్చు. సారవంతమైన మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది. కలుపు సమస్య బాగా తగ్గిపోతుంది. అంతేకాక గాలిలో నైట్రేట్ రూపంలో ఉన్న నత్రజని వర్షపు నీటితో పాటు నేలకు అందడం ద్వారా భూసారం పెరుగుతుంది. విత్తనం వేయడానికి ముందు రెండు సార్లు నేలను బాగా దుక్కి చేసుకుంటే పంట దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి.

విత్తుపై దృష్టి సారించని వ్యవసాయశాఖ

- జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సమీపిస్తున్నా... విత్తన పంపిణీ ఏర్పాట్లపై వ్యవసాయశాఖ ఇంకా దృష్టి సారించలేదు. జూన్ నుంచి కీలకమైన 'ముంగారు' మొదలు కానుంది. రైతులకు అవసరమైన వేరుశనగ, కందులు, పచ్చిరొట్ట, పెసలు, అలసంద, రాగులు, సజ్జ, మొక్కజొన్న తదితర విత్తనాలు ఏటా రాయితీతో పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. గత నాలుగేళ్లుగా మే చివరి వారం నుంచి పంపిణీ కొనసాగించారు. అయితే ఈ సారి సాధారణ ఎన్నికలు ఉన్నందున రాయితీ విత్తనం గురించి పట్టించుకోలేదు. ఈ నెల 13న ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో విత్తన సన్నాహక చర్యలపై దృష్టి సారించాల్సిన వ్యవసాయ శాఖ ఇంకా ఎన్నికల కమిషన్, ఇతర ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదని చెబుతున్నారు. దీంతో ఈ సారి విత్తన పంపిణీ ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో లక్ష క్వింటాళ్ల వరకు కే–6, 1812–రకం విత్తన వేరుశనగ అవసరం ఉంది. ఈ పాటికి వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో విత్తన సేకరణ, ప్రాసెసింగ్ కార్యక్రమం జరగాల్సి ఉంది. విత్తన సేకరణ (ప్రొక్యూర్‌మెంట్) ధర క్వింటా రూ.9,700 ప్రకారం నిర్ణయించినట్లు అనధికారిక సమాచారం. ఇందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్వాహకులు రైతుల నుంచి విత్తనం సేకరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాట్‌మెంట్, సేల్స్ ప్రైసెస్, సబ్సిడీ, పంపిణీ మార్గదర్శకాలు ఇంకా వెలువడాల్సి ఉంది. ఇప్పటికే అక్కడక్కడ వర్షాలు కురవడంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కొందరు జూన్ రెండు, మూడో వారంలోనే ముందస్తుగా వేరుశనగ విత్తనం వేసే అవకాశం ఉన్నందున వారికి విత్తనం అందించడానికి వ్యవసాయశాఖ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హోరాహోరీగా 'ఏసీఎల్ -2'

అనంతపురం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంతపురం క్రికెట్ లీగ్ -2 హోరాహోరీగా సాగుతోంది. బుధవారం దినేష్ గ్రానైట్స్, యునైటెడ్ చాంపియన్ క్రికెట్ క్లబ్‌ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి దినేష్ జట్టు బ్యాటింగ్ చేసింది. 18.5 ఓవర్లలో 144 పరుగులు వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని బ్యాటర్ అష్రఫ్ 47 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 63 పరుగులు చేశాడు. యునైటెడ్ జట్టు బౌలర్ రాజకుల్లాయప్ప నాలుగు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన యునైటెడ్ జట్టు 17.5 ఓవర్లలో 118 పరుగుల వద్ద చతికిలబడింది. జట్టులో అర్జున్‌టెండూల్కర్ 20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41 పరుగులు సాధించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అష్రఫ్‌కు ప్రకటించారు. అలాగే అనంత రైజింగ్ స్టార్, ఇండియన్ సిక్సర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టార్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. దినేష్ వర్మ 33 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 37 పరుగులు, బి. ప్రశాంత్ 46 బంతుల్లో 52 పరుగులు, ఎంకే దత్తారెడ్డి 23 బంతుల్లో 33 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 157 పరుగులు సాధించి ఓటమి పాలైంది.

సామాన్యుడిలా ఈరలక్కప్ప


టీ బంక్ వద్ద స్థానికులతో కలసి టీ తాగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ ప్రకటించినప్పటి నుంచి రోజూ జనసందోహం మధ్య బిజీబిజీగా గడుపుతూ వచ్చిన ఈరలక్కప్ప బుధవారం ఓ సామాన్యుడిలా మారిపోయారు. ఎన్నికల పోలింగ్ ముగియడంతో స్థానికులు, పార్టీ కార్యకర్తలతో సరదాగా గడుపుతున్నారు. బుధవారం ఉదయం గుడిబండలోని ఓ టీ బంక్ వద్దకు చేరుకుని అందరిలో తానూ ఒక్కడినంటూ కలిసి పోయి తేనీరు సేవించారు. ఈ సందర్భంగా ఆయన వెంట జెడ్పీటీసీ భూతరాజు, పార్టీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, సర్పంచ్ కరుణాకర్‌గౌడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ రాయుడు, నాగరాజు, రమేష్, తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

కిట్టయ్య మనసు బంగారం


కిట్టయ్య ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో దాహం తీర్చుకుంటున్న కోతులు


కోతులకు ఆహారం అందిస్తున్న కిట్టయ్య

పెద్దపప్పూరు: పుట్టింది నిరుపేద కుటుంబంలోనే అయినా తనకున్నంతలో మూగజీవాల ఆకలి దప్పికలు తీరుస్తున్నాడు కిట్టయ్య. ఒకట్రెండు సంవత్సరాలు కాదు... ఏకంగా 15 సంవత్సరాలుగా ఈ సేవ కొనసాగిస్తూ వస్తున్నాడు.

కిట్టయ్య రాక కోసం ఎదురుచూపు..

నార్పల మండలం నాయనపల్లి గ్రామానికి చెందిన కిట్టయ్య రాక కోసం ముచ్చుకోట అటవీ ప్రాంతంలోని మూగజీవాలు ఎదురు చూస్తూ ఉంటాయి. అరటి చెట్లకు సపోర్టుగా పెట్టే కట్టెల విక్రయంతో జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రోజూ 8 కిలోల బెల్లం అన్నం, వ్యాపారుల నుంచి సేకరించిన వివిధ రకాల పండ్లు, బ్రెడ్డును తన సొంత ఆటోలో వేసుకుని కుమారులు సాయికుమార్, గిరీష్ కుమార్‌తో కలసి ముచ్చుకోట అటవీ ప్రాంతానికి వెళుతుంటారు. ఇలా రోజూ రెండు పూటలా క్రమం తప్పకుండా అటవీ ప్రాంతానికి చేరుకుని ఆటో హారన్ కొట్టగానే ఎక్కడున్న కోతులు ఒక్కసారిగా అక్కడకు చేరుకుంటాయి. కిట్టయ్య అందించే ఆహారాన్ని కడుపార తిన్న తర్వాత నీటి తొట్లలో ఉన్న నీరు తాగి తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోతుంటాయి. నీటి తొట్లను సైతం దాతల సహకారంతో కిట్టయ్యనే ఏర్పాటు చేశాడు. రెండు పూటలా ఓ డ్రమ్ము నీటిని తీసుకెళ్లి తొట్లను నింపుతుంటాడు. అటుగా వెళుతున్న వారు కిట్టయ్య సేవ చూసి అభినందిస్తున్నారు. తన ప్రాణం ఉన్నంత వరకూ ఈ సేవ కొనసాగిస్తానని, తన కుమారులు సైతం ఈ సేవను కొనసాగించేలా ఇప్పటి నుంచే వారికి మూగజీవాలకు చేరువ చేస్తున్నట్లుగా కిట్టయ్య తెలిపారు.

పోలీసుల అదుపులో మండల నాయకులు

యాడికి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా తాడిపత్రి నియోజకవర్గంలో చోటు చేసుకున్న ఘర్షణలకు సంబంధించి ముందస్తు జాగ్రత్తగా పలువురు మండల నాయకులు, గ్రామ స్థాయి నాయకులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబుతో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు. కాగా, విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

'వేసవి' దొంగలతో జాగ్రత్త

- అప్రమత్తతతో చోరీలకు అడ్డుకట్ట
- ప్రజలకు పోలీసుల సూచనలు



బత్తలపల్లి: వేసవి అంటే కేవలం ఉక్కపోత, వడదెబ్బే కాదు... దొంగతనాలు కూడా ఉంటాయి. జనం హాయిగా ఆరు బయటనో, మిద్దెపైనో నిద్రపోతుంటే దొంగలు ఎంచక్కా బీరువాలు తెరిచి సొత్తుతో ఉడాయిస్తుంటారు. వేసవిలో విహారయాత్రలు, తీర్థ యాత్రలకు, ఊళ్లకు వెళ్లే కుటుంబాలే లక్ష్యంగా దొంగలు చెలరేగుతారు. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉంటే చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చునని పోలీసులు అంటున్నారు. ఈ అంశంపై ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఇంతకు పోలీసులు చెబుతున్నదేమిటో పరిశీలిద్దామా....

- ఇంటి కిటికీలు మూసివేయాలి. వాటికి ఉన్న బోల్టులు సక్రమంగా ఉన్నాయో, లేదో ఎప్పటికప్పుడు చూసుకోవాలి.
- దుస్తుల్లో డబ్బులు పెట్టి కిటికీలకు, తలుపులకు తగిలించరాదు.
- ఆరు బయట, మిద్దెలపై నిద్రించే వారు అప్రమత్తంగా ఉండాలి. ఇంటికి ఒకటికి రెండు తాళాలు వేసుకోవాలి.
- బంగారు ఆభరణాలు ధరించి ఆరు బయట నిద్రించకూడదు. ఇంట్లో పడుకున్నా కిటికీలు తెరిచి ఉండే వైపు పడుకోరాదు.
- వీలైతే ఇంటి ఆవరణలో పెంపుడు కుక్కలను కట్టేయాలి. ఇంట్లో ఎలాంటి అలికిడి వినిపించినా వెంటనే అప్రమత్తం కావాలి. అలసత్వం ప్రదర్శించరాదు.
- అపరిచిత వ్యక్తుల వాహనాల్లో ప్రయాణించరాదు.
- దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలపాలి.
- రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వస్తే వారి వివరాలు తెలుసుకుని నమోదు చేసుకోవడం మంచిది.
- అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారమివ్వాలి.
- ఇంట్లోని బంగారు నగలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం ఉత్తమం.

చోరీల నియంత్రణకు చర్యలు



వేసవిలో చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేశాం. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నాం. ఈ విషయంలో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

– పి.శ్రీనివాసులు, ఎస్ఐ, బత్తలపల్లి

టీబీ డ్యాంలో 3.4 టీఎంసీల నీరు


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, అనంతపురం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరప్రదాయిని అయిన తుంగభద్ర డ్యాంలో బుధవారం నాటికి 3.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం సామర్థ్యం 1,633 అడుగులు కాగా, 1,577.59 అడుగుల మేర నీరు నిలిచి ఉంది. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో లేదు. గత ఏడాది ఇదే సమయానికి 3.44 టీఎంసీల నీరు నిల్వతో 1,868 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 215 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండింది.

అక్కమాంబ ఆలయంలో చోరీ


దుండగుల చేతిలో ధ్వంసమైన హుండీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో వెలసిన మహిమాన్విత అక్కమాంబ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఏడాది ఉగాది నాడు అత్యంత వైభవంగా అక్కమాంబ జాతర నిర్వహించారు. అప్పటి నుంచి ఆలయ హుండీని లెక్కింపు చేపట్టలేదు. ఈ క్రమంలో గురువారం హుండీలోని భక్తుల కానుకలను లెక్కించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సిద్ధమయ్యారు. ఇంతలో మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడిన దుండగులు హుండీని ధ్వంసం చేసి అందులోని కానుకలను అపహరించుకెళ్లారు. ఆలయంలోని సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో ఇంటి దొంగల పనిగానే పలువురు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


ప్రసాద్ మృతదేహం

గుంతకల్లు టౌన్: స్థానిక అంకాలమ్మ గుడి వీధికి చెందిన బోయ ప్రసాద్ (40) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. వివరాలు... బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ప్రసాద్‌కు భార్య కవిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన రాత్రైనా ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. బుధవారం ఉదయం పొలం పనులకు వెళుతున్న వ్యవసాయ కూలీలు నల్లరేగడి పొలంలో పడి ఉన్న ప్రసాద్ మృతదేహాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో పాటు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి గొంతుపై ఉన్న రక్తపు గాట్లు, ముక్కులో నుంచి రక్తం కారడాన్ని బట్టి హత్య చేసి ఉంటారని కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడి తండ్రి లక్ష్మణ్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మమ్మల్నే ప్రశ్నిస్తావా?

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేసిన టీడీపీ నేతలు


గాయపడిన బేల్దారి శివ

గుంతకల్లు: రయ్యిమంటూ వీధిలో ద్విచక్ర, వాహనాలు నడుపుతూ స్థానికులను ఎందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ప్రశ్నించిన ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడి చేశారు. వివరాలు... మంగళవారం అర్ధరాత్రి టీడీపీకి చెందిన పలువురు ఫుల్‌గా మద్యం సేవించి ఐదారు ద్విచక్ర వాహనాల్లో చక్కర్లు కొడుతూ 17వ వార్డులోని నామాల్‌సేట్ కల్యాణమంటపం సమీపంలో ఉన్న నాగలయ్య కట్ట వీధికి చేరుకున్నారు. మద్యం మత్తులో కేకలు వేస్తూ ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా రైజ్ చేస్తుండడంతో భారీ శబ్దం వెలువడింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బేల్దారి శివ వారిని అడ్డుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇలా చేయడం సబబు కాదని హితవు పలికారు. మమ్మల్నే ప్రశ్నిస్తావా? అంటూ పచ్చమూకలోని సూరి, గోవిందు, హరి, కిషోర్, తేజు తదితరులు శివ మీద విరుచుకుపడ్డారు. సిద్ధంగా ఉంచుకున్న ఇనుప రాడ్లతో కింద పడేసి కొట్టారు. శివ అరుపులకు చుట్టుపక్కల ఇళ్లలోని వారు నిద్రలేచి రావడం గమనించిన పచ్చమూక అక్కడి నుంచి ఉడాయించింది. తీవ్ర రక్తగాయాలతో ఉన్న శివను వెంటనే వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ వాసు, ఇతరులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఒకరి కోసం వచ్చి మరొకరిపై దాడి?

పచ్చమూక ప్రణాళిక ప్రకారం ఇనుప రాడ్లతో వీధిలో తిరగడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలింగ్‌కు రెండు రోజుల ముందు 17వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు డబ్బుతో పాటు మద్యం పంపిణీ చేస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో టీడీపీకి వ్యతిరేకంగా వార్డు ప్రజలు ఓటు వేశారన్న అనుమానాలు కూడా తోడయ్యాయి. దీనికి కారకులైన వారిని లక్ష్యంగా చేసుకుని దాడికి టీడీపీ నేతలు పథకం రచించినట్లుగా తెలుస్తోంది.

క్లుప్తంగా

విత్తన వేరుశనగ, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండి



జేడీఏ ఉమామహేశ్వరమ్మకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సమీపిస్తుండటంతో రైతులు ఇబ్బంది పడకుండా 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ, అలాగే పెండింగ్‌లో ఉన్న ఇన్‌పుట్‌సబ్సిడీ అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ ఎం.రవి, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. గతేడాది వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నందున పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కరువు నివారణ చర్యల్లో భాగంగా విత్తన వేరుశనపై సబ్సిడీ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 2023 ఖరీఫ్, రబీకి సంబంధించి ఇన్‌పుట్‌సబ్సిడీ ఇవ్వడంతో పాటు రాయితీతో రైతులకు అవసరమైన చిరుధాన్యాల విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు.

పీఏబీఆర్‌లో వాల్వ్ సమస్య



ఎగిసిపడుతున్న నీరు

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యాంలో ఎయిర్ వాల్వ్‌లో లీకేజీ ఏర్పడటంతో తాత్కాలికంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, తదితర బృందం పీఏబీఆర్ డ్యాంను సందర్శించి సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బుధవారం సాయంత్రం రావాల్సిన నీరు గురువారం నుంచి యథావిధిగా వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.

ఆత్మకూరు మండలంలో భారీగా పోలింగ్



ఆత్మకూరులోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు (ఫైల్)

- రికార్డు స్థాయిలో 87 శాతం నమోదు
- ఉత్సాహంగా ఓటు వేసిన ప్రజలు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎక్కువ శాతం వృద్ధులు, మహిళలు ఓటు వేయడానికి ముందుకు రావడం విశేషం. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా ఓపిగ్గా క్యూలో నిలబడి ఓటు వేశారు. మండల వ్యాప్తంగా 33,227 మంది ఓటర్లు ఉండగా.. వారిలో పురుషులు 15,263 మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. స్త్రీలు 13,595 మంది ఓటు వేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 28,858 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గతంలో 6,400 మెజార్టీ..

ఆత్మకూరు మండల వ్యాప్తంగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 6,400 ఓట్ల మెజార్టీ లభించింది. పార్టీలు, కుల, మతాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందించారు. దీంతో ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీ పార్టీకే పట్టం కట్టిండొచ్చని తెలుస్తోంది.

గ్రామం	మొత్తం ఓట్లు	పోలైన పురుషుల ఓట్లు	పోలైన మహిళల ఓట్లు	పోలైన మొత్తం ఓట్లు
సిద్దరాంపురం	1367	652	642	1294
వై.కొత్తపల్లి, పి.యాలేరు	2477	1115	1114	2229
సింగంపల్లి	745	352	345	706
సింగంపల్లి తండా	573	265	261	526
ఆత్మకూరు	7510	3210	3202	6412
పంపనూరు	1270	614	555	1169
ముట్టాల	2340	1024	1022	2047
గొరిదిండ్ల	1508	680	743	1423
వేపచెర్ల	422	198	193	391
వీఈ తండా	473	223	228	451
వీడీ తండా	601	301	257	558
తలుపూరు	2019	976	962	1938
వడ్డుపల్లి	1219	584	544	1128
మదిగుబ్బ	2130	1013	935	1948
బి.యాలేరు	2163	1061	952	2013
సనప	2839	1312	1254	2566
రంగంపేట	838	411	386	797
తోపుదుర్తి	2643	1272	1144	2416
మొత్తం	33,227	15,263	13,595	28,858

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. ఈ నెలలో అడ్మిషన్ చేసుకుంటే ఒక ఫీజు, జూన్ మాసంలో చేసుకుంటే ఒక ఫీజు ఉంటుందని తల్లితండ్రులకు మాయమాటలు చెబుతూ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పూర్తయ్యాయంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నగర నాయకులు హరికృష్ణ, రారాజు, షమీర్ పాల్గొన్నారు.

ఎస్కేయూ ప్రొఫెసర్‌కు కర్క ముత్తారెడ్డి స్మారక బహుమతి



ప్రొఫెసర్ జీవీ రమణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, సోషియాలజీ విభాగం ప్రొఫెసర్ జీవీ రమణకు కర్క ముత్తారెడ్డి స్మారక బహుమతి దక్కింది. సాయుధ తెలంగాణ పోరాట యోధుడు కర్క ముత్తారెడ్డి స్మారకార్థం వసుంధర విజ్ఞాన మండలి రెండు తెలుగు రాష్ట్రాల కవితల పోటీ నిర్వహించారు. ఇందులో స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసకుల కోటాలో జీవీ రమణ ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే 31వ కర్క ముత్తారెడ్డి స్మారక సంస్థ వార్షికోత్సవ సభలో బహుమతిని అందజేస్తారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నరసారెడ్డి దంపతులు

అనంతపురం కల్చరల్: స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలో వేలాది మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. చాలా మంది ప్రత్యేక శుభదినాల్లో వేలకు వేలు ఖర్చుపెడుతూ రెస్టారెంట్లలో వృథా చేస్తుంటారన్నారు. అలా కాకుండా నరసారెడ్డి, రాజ్యలక్ష్మి దంపతులు తమ 30వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా 3 వేల మందికి మజ్జిగ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. గత తొమ్మిదేళ్లగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గోపాలరెడ్డి, గంగాధర్, మౌర్యవర్ధన్‌రెడ్డి, లేఖన, మధుమతి, స్నేహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మూడ్‌లోనే అధికారులు



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



తాళం వేసిన వ్యవసాయ కార్యాలయం వద్ద అధికారుల కోసం వేచి చూస్తున్న రైతులు

- ఎన్నికలు ముగిసినా విధులకు గైర్హాజరు
- కార్యాలయాల వద్ద అధికారుల కోసం ప్రజల పడిగాపులు

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినా అధికారులు మాత్రం ఇంకా ఎన్నికల మూడ్‌లోనే ఉన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో చాలామంది అధికారులు విధుల్లో కనబడలేదు. కార్యాలయాల్లోని కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత నెల రోజులుగా ఎన్నికల విధులంటూ బయటనే తిరుగుతున్న అధికారులు, ఎన్నికలు పూర్తయినప్పటికీ ఇంక వారి సొంత కార్యాలయాల్లో విధులకు హాజరుకావడం కాలేదు. మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ కార్యాలయాల్లో ఎక్కడా ఒక్క అధికారి కూడా కనిపించడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు అధికారులు లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ పంట రుణాల రెన్యూవల్స్ చేసుకునేందుకు రైతులు వన్‌బీ, అడంగల్ పత్రాలతో పాటు అధికారులు సంతకాల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కానీ తహసీల్దార్ దగ్గర నుంచి వీఆర్వో వరకు అధికారులు ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. పిల్లలను కళాశాలలు, పాఠశాలలో చేర్పించేందుకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు తల్లిదండ్రులు కూడా స్థానిక తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాని అక్కడ కూడా అధికారులు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వన్‌బీ, అడంగల్ కోసం అవస్థలు..

ప్రస్తుతం బ్యాంకుల్లో పంట రుణాలు చేసుకునేందుకు రైతులకు భూముల వివరాల తెలిపే వన్‌బీ, అడంగల్ కాపీలు కావాల్సి ఉంది. గతంలో వీటిని సచివాలయాలు, మీ-సేవాల కేంద్రాల ద్వారా రైతులు పొందేవారు. కాని మండలంలో భూముల రీ సర్వే జరుగుతున్న కనగానపల్లి, ముత్తువకుంట్ల, నరసంపల్లి, యలకుంట్ల గ్రామాల్లోనికి రైతులకు ఆన్‌లైన్‌లో రావడం లేదంటున్నారు. దీంతో ఈ గ్రామాల రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకే వచ్చి రెవెన్యూ అధికారుల నుంచి పొందాల్సి ఉంది. కాని కార్యాలయానికి రెవెన్యూ అధికారులు రాకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. వన్‌బీ, అడంగల్ కాపీలు ఇవ్వకపోతే బ్యాంకు అధికారులు రుణాలు రెన్యూవల్ చేయడం లేదు. రుణాల రెన్యూవల్ సమయం మించిపోతే వడ్డీ భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా వ్యవసాయశాఖ కార్యాలయం తలుపులు కూడా తెరవకపోవటంతో పనులు కోసం వచ్చిన రైతులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు.

వారం రోజులుగా తిరుగుతున్నాను



మీ-సేవా కేంద్రాల్లో వన్‌బీలు రావడం లేదు. దీంతో వీటిని పొందేందుకు వారం రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. కాని అధికారులు ఎవ్వరూ ఇక్కడ ఉండటం లేదు. ఎన్నికల పూర్తయిన తర్వాత వస్తారనుకుంటే ఈ రోజు కూడా ఎవ్వరూ రాలేదు.

– ఓబిలేసు, రైతు, ముత్తువకుంట్ల

రుణాల రెన్యూవల్‌కు ఇబ్బంది



వన్‌బీ, అడంగల్ కాపీలపై రెవెన్యూ అధికారులు సంతకాలు లేకపోతే బ్యాంకుల్లో పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవడం లేదు. కాని అధికారుల సంతకాల కోసం నాలుగు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. తహసీల్దార్‌తో పాటు మిగిలిన సిబ్బంది కూడా అందుబాటులో లేరు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మయ్య, రైతు, యలకుంట్ల

పార్కింగ్ ఆంక్షలు.. రోగులకు ముచ్చెమటలు

- గర్భిణులు, దివ్యాంగులకు అవస్థలు
- ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అంబులెన్స్‌లు



జీజీహెచ్‌లో చెక్‌పోస్టును తలపించేలా బారికేడ్ ఏర్పాటు చేసిన దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పార్కింగ్ ఆంక్షలు రోగులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఆపద సమయంలో ఉన్న రోగులకు ప్రతి క్షణం ఎంతో అమూల్యమైనది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రోగుల ప్రాణాలకే ప్రమాదం. అటువంటిది రోగులు, గర్భిణులను సకాలంలో ఆయా వార్డులకు తీసుకెళ్లాలి. కానీ ఆస్పత్రి ఆవరణలోని ప్రవేశమార్గం, ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహం ముందున్న పలు చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో గర్భిణులు, రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లేబర్ వార్డు వరకు అంబులెన్స్ వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ ప్రాంతంలో బారికేడ్ ఏర్పాటు చేయడంతో ఆస్పత్రి చుట్టూ అంబులెన్సులు ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. గతంలో అంబులెన్స్‌లో వచ్చిన గర్భిణులు ఆరుబయటే ప్రసవించిన దాఖలాలు లేకపోలేదు. రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు తీసుకున్న నిర్ణయం రోగులకు తలనొప్పిగా మారింది. ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యులు, స్టాఫ్‌నర్సుల వాహనాలు పార్కింగ్ చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సెక్యూరిటీ నోటిదురుసుతో కొంత మంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సంతకం చేసి వెళ్లే సమయంలో లోపలికి వాహనాలు పంపకపోవడాన్ని తప్పుబడుతున్నారు. ఇదెలా ఉన్నా.. అంబులెన్స్‌లకు దారి ఇచ్చేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. ఇదే విషయమై రెసిడెన్సియల్ మెడికల్ ఆఫీసర్లను సంప్రదించగా.. ఆస్పత్రి వెనుకవైపు నుంచి వాహనం తీసుకువస్తే సరిపోతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.





బారికేడ్లు ఏర్పాటు చేయడంతో అంబులెన్స్‌లో గర్భిణిని వెనుక వైపు నుంచి లేబర్ వార్డుకు తరలిస్తున్న సిబ్బంది, ఆస్పత్రి వెనుకవైపు ట్రాఫిక్ జామ్

ఇజ్రాయెల్ మారణకాండను వ్యతిరేకించాలి



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ నాయకులు

అనంతపురం అర్బన్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దేశం చేస్తున్న మారణకాండను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలంటూ ఎస్‌యూసీఐ(సీ) నాయకులు కోరారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి డి.రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి బీఎస్ అమర్‌నాథ్, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడారు. సామ్రాజ్యవాద, యుద్ధోన్మాద అమెరికా దేశం పూర్తి మద్దతుతో జియనిస్ట్ ఇజ్రాయెల్ ఫాసిస్టు ప్రభుత్వం గత అక్టోబరు నుంచి పాలస్తీనా దేశ ప్రజలపై ముఖ్యగా గాజా ప్రాంతంలోని ప్రజలపై అమానుషంగా దాడులు చేస్తోందన్నారు. ఇప్పటికే 35 వేల మందికి పైగా మరణించారన్నారు. ఇందులో 14 వేలకు పైగా పసిపిల్లలు మరణించారని తెలిపారు. ఇజ్రాయెల్ ఆకృత్యాలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నయాకులు తబ్రేజ్ ఖాన్, నాగముత్యాలు, మహేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఒకరిని డిబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. గుత్తి పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఓ విద్యార్థిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగమేశ్వర ఆలయంలో బుధవారం భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను లెక్కించారు. గతేడాది డిసెంబర్ 30 నుంచి ఇప్పటి వరకూ రూ.1,05,261 నగదును స్వామివారికి హుండీ కానుకల రూపంలో భక్తులు సమర్పించారు.



విద్యుత్‌నగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి వీధిలో రూ.28 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు



హౌసింగ్ బోర్డులో రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఎస్ క్యాప్ నిధులు రూ.1.2 కోట్లతో సీసీ రోడ్డు



జనశక్తి నగర్‌లో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ డ్రైన్ పనులు

అభివృద్ధి పరుగులు

అనంతపురం కార్పొరేషన్: ఓ వైపు ఎన్నికల హడావుడి ముగిసినా.. నగరంలో అభివృద్ధి ఆగలేదు. వివిధ డివిజన్లలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రస్తుతం నగరంలో రూ.3 కోట్లకుపైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అందులో ఎస్ క్యాప్ నిధులు రూ.1.2 కోట్లతో రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ వద్ద సీసీ రోడ్డు, రూ.70 లక్షలతో అశోక్‌నగర్ హరిహర దేవాలయం నుంచి రాంనరేష్ ఫంక్షన్ హాల్ వరకు బీటీ రోడ్డు, జనశక్తి నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.80 లక్షలతో సీసీ డ్రైన్ పనులు ఊపందుకున్నాయి. విద్యుత్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వీధిలో నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.28 లక్షలతో సీసీ రోడ్డు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో నగరపాలక సంస్థ ఇంజినీర్లు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు.